



బరిలో వీరులు

» గెలుపు ఎవరిదో?
- 7లో

భారీగా యువ ఓటర్లు

» విశాఖ జిల్లాలో 2.48 శాతం మంది మొదటిసారి ఓటు హక్కు వినియోగం

ఓటుకు వేళాయె..



ఒక పార్లమెంటు, మూడు అసెంబ్లీ స్థానాలకు పోలింగ్ నేడు

- ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు..
- జిల్లాలో మొత్తం ఓటర్లు 7,71,193 మంది
- పురుషులు 3,71,120, మహిళలు 4,00,034, ఇతరులు 39 మంది



పాడేరులో ఎన్నికల సామగ్రి తీసుకు వెళుతున్న పోలింగ్ సిబ్బంది

- పోలింగ్ కేంద్రాలు 1,021
- సమస్యాత్మక కేంద్రాలు 695
- సజావుగా పోలింగ్ సామగ్రి, సిబ్బంది తరలింపు
- కలెక్టర్ విజయసునీత, జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా ఏర్పాట్ల పర్యవేక్షణ

(పాడేరు- ఆంధ్రజ్యోతి)

సార్వత్రిక ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. జిల్లాలో ఒక పార్లమెంటు, మూడు అసెంబ్లీ స్థానాలకు సోమవారం ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ జరగనున్నది. జిల్లాలో 7,71,193 మంది ఓటర్ల కోసం 1,021 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

జిల్లాలో సోమవారం జరిగే సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన సామగ్రి, సిబ్బంది తరలింపు ప్రక్రియను అధికారులు ఆదివారం సజావుగా నిర్వహించారు. పాడేరు, అరకులోయ, రంపచోడవరం అసెంబ్లీ కేంద్రాల్లో ఆయా నియోజకవర్గాల్లోని పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సామగ్రి, సిబ్బంది తరలింపు పనులు రిటర్నింగ్ అధికారులు భావన వశిష్ఠ, అభిషేక్, ప్రశాంత్‌కుమార్ చేపట్టారు. జిల్లాలో మొత్తం 7,71,193 మంది ఓటర్లు ఉండగా, 1,021 పోలింగ్ కేంద్రాలను 170 సెక్టార్లుగా విభజించి, వాటి పరిధిలోని పోలింగ్ కేంద్రాల పర్యవేక్షణ, తాజా సమాచార సేకరణను ఆయా అధికారులకు అప్పగించారు. జిల్లా వ్యాప్తంగా ఎన్నికల నిర్వహణకు 6.100 మంది సిబ్బందిని నియమించారు.

జిల్లాలో 695 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు

జిల్లాలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో మొత్తం 1,021 పోలింగ్ కేంద్రాల్లో 695 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మకమైనవిగా గుర్తించి, ఆయా కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేశారు. జిల్లాకు ఆనుకుని ఉన్న ఒడిశా, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ సరిహద్దు ప్రాంతాల్లో, మారుమూల పోలింగ్ కేంద్రాల్లో పటిష్ఠ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎన్నికల నేపథ్యంలో మావోయిస్టు ప్రభావాన్ని అరికట్టేందుకు రెండు నెలల ముందు నుంచే ఏవోబీలో పోలీసు బలగాలు గాలింపు చర్యలు ముమ్మరం చేశాయి. జిల్లాలో, జిల్లాకు సరిహద్దు ప్రాంతాల్లోనూ చెక్ పోస్టులను ఏర్పాటు చేసి తనిఖీలు చేపడుతున్నారు.

ఎన్నికల సామగ్రి, సిబ్బంది తరలింపు

జిల్లాలో ఆదివారం ఎన్నికల సామగ్రి పంపిణీ ప్రక్రియ సజావుగా జరిగింది. అరకులోయ అసెంబ్లీ స్థానం పరిధిలోని మారుమూల ప్రాంతాలైన ముంచంగిపుట్టు, పెదబయలు మండలాలకు తొలుత, ఆ తరువాత హుకుంపేట, డుంబ్రిగుడ, అరకులోయ, అనంతగిరి మండలాలకు సామగ్రిని తరలించారు. స్థానిక అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రానికి దూరంగా ఉన్న కొయ్యూరు, జీకేవీధి, చింతపల్లి ప్రాంతాలకు తొలుత, ఆ తరువాత జి.మాడుగుల, పాడేరు మండలాలకు ... మిగతా 8వ పేజీలో



ఈవీఎం స్ట్రాంగ్‌రూమ్‌ను తెరిపిస్తున్న కలెక్టర్ విజయసునీత, పరిశీలకుడు వివేకానందన్, ఆర్వో భావన వశిష్ఠ

మన్యంలో హోరా హోరీ

పాడేరు, అరకు అసెంబ్లీ స్థానాల్లో గట్టి పోటీ

- రసవత్తరంగా ఎన్నికల పోరు
- వైసీపీ పాలనపై గిరిజనుల్లో తీవ్ర వ్యతిరేకత
- ఆ పార్టీ అభ్యర్థులపై తీవ్ర ప్రభావం
- కూటమి మేనిఫెస్టో అన్ని వర్గాలను ఆకర్షించడంతో ఆ అభ్యర్థులకు మేలు

(పాడేరు- ఆంధ్రజ్యోతి)

గిరిజన ప్రాంతంలోనూ ఓటర్లలో చైతన్యం వచ్చింది. తమ భవిష్యత్తు, గ్రామాల అభివృద్ధి, తమకున్న ప్రత్యేక చట్టాలు, హక్కుల రక్షణకు ప్రాధాన్యం ఇచ్చే పార్టీల వైపే మొగ్గు చూపుతున్నారు. దీంతో పాడేరు, అరకు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఈసారి ఎన్నికల పోరు రసవత్తరంగా ఉండే అవకాశం ఉంది.

పాడేరు



గిడ్డి ఈశ్వరి(టీడీపీ)



విశ్వేశ్వరరాజు (వైసీపీ)

అరకు



పాంగి రాజారావు(బీజేపీ)



మత్స్యలింగం (వైసీపీ)

పాడేరు అసెంబ్లీ స్థానంలో ఈసారి ఎన్నికల్లో మొత్తం 16 మంది అభ్యర్థులు బరిలో ఉన్నప్పటికీ ప్రధాన పోటీ మాత్రం టీడీపీ, వైసీపీ మధ్యే ఉంటుందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. ఎమ్మెల్యే స్థానానికి గిడ్డి ఈశ్వరి (టీడీపీ), మత్స్యరాస విశ్వేశ్వరరాజు (వైసీపీ), సుర్ల అప్పారావు (బీఎస్పీ), సతకా బుల్లిబాబు (కాంగ్రెస్), కింటుకూరి జోసెఫ్ (ఇండియా ప్రజాబంధు పార్టీ), మినుముల రాంబాబు (సమాజ్ వాదీ పార్టీ), కిల్లో రంగారావు (భారత చైతన్య పార్టీ), దమంతి నాగేశ్వరరావు (జైభారత్ నేషనల్ పార్టీ), బొంకు అర్జునరావు (జై మహా భారత్ పార్టీ), స్వతంత్ర అభ్యర్థులుగా వంతాల సుబ్బారావు, వల్లా మౌనిక, అడపా విష్ణుమూర్తి, ఎస్.శంకరరావు, చెర్రెకి అప్రియంబాబు, డొంకాడ శివప్రసాద్, కొక్కుల కన్నబాబు..ఇలా మొత్తం 16 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. వీరిలో టీడీపీ అభ్యర్థి గిడ్డి ఈశ్వరి, వైసీపీ అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వరరాజు మధ్య గట్టి పోటీ ఉంది. అయితే వైసీపీ పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉండడం, కూటమి మేనిఫెస్టో అన్ని వర్గాలను ఆకర్షించడం కొంత వరకు గిడ్డి ఈశ్వరికి కలిసొస్తుందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

ఈశ్వరికి కలిసొచ్చే అంశాలు

ప్రతి పంచాయతీ పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలు చేపడడంతో పాటు ప్రతి గిరిజనుడికి ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేశారు. అన్ని గ్రామాల్లో సామాజిక భవనాలు, తారురోడ్డు, సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణాలను చేపట్టారు. గత ఐదేళ్లుగా నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో పార్టీ క్యాడర్‌ను బలోపేతం చేశారు. పార్టీ క్యాడర్, అన్ని సామాజిక వర్గాలకు చెందిన నేతలు, ప్రజలతో సత్సంబంధాలు ఏర్పరచుకుని పరిస్థితులను తనకు అనుకూలంగా మలుచుకున్నారు.

జగన్ ప్రభుత్వంపై వ్యతిరేకత ప్రభావం

ఐదేళ్ల జగన్ పాలనపై ప్రజల్లో నెలకొన్న వ్యతిరేకత వైసీపీ అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వరరాజుపై తీవ్ర ప్రభావం చూపనుంది. గ్రామాలు అభివృద్ధి జరగకపోవడంతో పాటు అధిక ధరలు, గిరిజన చట్టాలు సక్రమంగా అమలుకాకపోవడం, జీవో 3 రద్దు, హైడ్రో పవర్ ప్రాజెక్టులు, ఉద్యోగులపై వేధింపులు వంటి అంశాలు వైసీపీ అభ్యర్థిపై ప్రతికూల ప్రభావం పడనుంది. ఈ పరిణామాల నేపథ్యంలో వైసీపీ గెలుపు సాధ్యం కాదనే ప్రచారం జరుగుతున్నది. ఇక అరకు అసెంబ్లీ విషయానికి వస్తే కూటమి తరఫున బీజేపీ అభ్యర్థిగా పాంగి రాజారావు, వైసీపీ అభ్యర్థిగా మత్స్యలింగం, కాంగ్రెస్ అభ్యర్థిగా శెట్టి గంగాధరస్వామి పోటీ పడుతున్నారు. అయితే బీజేపీ, వైసీపీ అభ్యర్థుల మధ్యే ప్రధాన పోటీ ఉంది. విజయం ఎవరిని వరిస్తుందో వేచి చూడాలి.

ఏవోబీ జల్లెడ

పోలీసుల నిఘా నీడలో మన్యం

- ఎన్నికల నేపథ్యంలో పోలీసు బలగాల ముమ్మర గాలింపు



సీలేరు పోలీస్ స్టేషన్ పరిధి ఆంధ్రా- ఒడిశా సరిహద్దుల్లో ప్రధాన రహదారిలోని కల్వర్టును తనిఖీ చేస్తున్న బాంబ్ స్క్వాడ్ సభ్యులు

సీలేరు, మే 12:

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జీకేవీధి మండలంలోని సీలేరు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆంధ్రా- ఒడిశా సరిహద్దుల్లో ఆదివారం పోలీసు బలగాలు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించాయి. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలన్న నిఘా వర్గాల హెచ్చరికలతో ధారకొండ, గుమ్మిరేవుల, దుప్పులవాడ, గాలికొండ, సీలేరు పంచాయతీల పరిధిలో గల పోలింగ్ కేంద్రాల పరిసర ప్రాంతాలను గ్రేహౌండ్స్, స్పెషల్ పార్టీ, సీఆర్‌పీఎఫ్ బలగాలతో గాలింపు చర్యలు చేపట్టారు. ఆంధ్రా- ఒడిశా సరిహద్దుల్లోని ప్రధాన రహదారిలో గల వివిధ కల్వర్టులను బాంబ్ స్క్వాడ్ తనిఖీ చేశాయి. ఎన్నికల వాహనాలకు, సిబ్బందికి మావోయిస్టుల నుంచి ఎటువంటి ముప్పు వాటిల్లకుండా ఉండేందుకు జీకేవీధి నుంచి సీలేరు వరకు గల ప్రధాన రహదారిలో భారీగా పోలీసు బలగాలను మోహరించారు. ఎన్నికల ప్రక్రియ ముగిసి బ్యాలెట్ బాక్సులు మావోయిస్టుల ప్రభావిత ప్రాంతాల నుంచి సురక్షితంగా వెళ్లేంత వరకు సీలేరు జీకేవీధి ప్రధాన రహదారిలో పోలీసుల నిఘా కొనసాగుతుందని జీకేవీధి సీఐ అప్పలనాయుడు తెలిపారు.

ముంచంగిపుట్టులో..

ముంచంగిపుట్టు: మండలంలోని 23 పంచాయతీల పరిధిలో మొత్తం 50 పోలింగ్ కేంద్రాలను మావోయిస్టు ప్రభావిత కేంద్రాలుగా అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. ప్రశాంతంగా ఎన్నికలు జరిగేందుకు కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. ఆదివారం మండల కేంద్రం నుంచి పెదబయలు, జోలాపుట్టు, కుమడ, లక్ష్మీపురం తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రధాన రహదారులపై పలు చోట్ల సీఆర్‌పీఎఫ్ పోలీసు బలగాలు అడుగడుగునా మోహరించాయి. ఎస్‌ఐ కె.రవీంద్ర ఆధ్వర్యంలో పోలీసులు రాత్రి గస్తీ నిర్వహిస్తున్నారు. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు చెక్ పోస్టు వద్ద ముమ్మర వాహన తనిఖీలు నిర్వహించారు.

కొయ్యూరులో..

కొయ్యూరు: మండలంలో మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించిన పోలింగ్ కేంద్రాల సమీపంలో ఆదివారం ఉదయం నుంచి పోలీసు బలగాలు ముమ్మర గాలింపు చర్యలు చేపట్టాయి. వాహనాల తనిఖీలు నిర్వహించారు.



ముంచంగిపుట్టు- పెదబయలు మార్గంలో తనిఖీలు చేపడుతున్న సీఆర్‌పీఎఫ్ పోలీసులు

వేసవిలోనూ మంచు అందాలు కనువిందు

- సందర్శకులను ఆకట్టుకుంటున్న చెరువులవేనం

ప్రకృతి అందాలకు నెలవుగా ఉన్న చెరువులవేనం వేసవిలోనూ మంచు సోయగాలతో ఆకట్టుకుంటోంది. మన్యంలో పది రోజులుగా తొలకరి వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. దీంతో వాతావరణంలో ఒక్కసారిగా మార్పు వచ్చింది. కనిష్ఠ ఉష్ణోగ్రతలు కాస్త తగ్గుముఖం పట్టాయి. రెండు రోజులుగా ప్రతి రోజు మంచు కురుస్తున్నది. శీతాకాలం మాదిరిగా ఉదయం ఎనిమిది గంటల వరకు మంచు దుప్పటి కప్పుకుని ఉంటుంది. దీంతో ఆదివారం చెరువులవేనం వద్ద పరుచుకున్న మంచు మేఘాలు సందర్శకులను మంత్రముగ్ధులను చేశాయి. పచ్చని కొండలను తాకుతూ పయనిస్తున్న శ్వేత వర్ణ మేఘాలు కనువిందు చేశాయి. ఇప్పటికి చెరువులవేనం అందాలను వీక్షించేందుకు పదుల సంఖ్యలో పర్యాటకులు తరలి వస్తున్నారు. - చింతపల్లి



చెరువులవేనంలో ఆదివారం ఆవిష్కృతమైన మంచు మేఘాలు

పోలింగ్ కేంద్రం లేక పాట్లు

బుంగాపుట్టు గ్రామస్థులకు తప్పని ఇబ్బందులు

- గత ఎన్నికల సమయంలో ఆందోళన
- 10 కిలోమీటర్ల దూరంలో బూత్‌ను ఏర్పాటు చేసిన అధికారులు
- ఈసారి కూడా ఓట్లు వేయబోమని గిరిజనుల స్పష్టీకరణ
- ఓట్లు వేయడానికి వాహనాల్లో తీసుకువెళ్లి తిరిగి తీసుకురారని ఆవేదన



ఆందోళన చేస్తున్న బుంగాపుట్టు పంచాయతీ గిరిజనులు (ఫైల్ ఫొటో)

ముంచంగిపుట్టు, మే 12:

మండలంలోని మారుమూల బుంగాపుట్టు పంచాయతీ కేంద్రంలో పోలింగ్ బూత్ లేకపోవడంతో గిరిజనులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఇక్కడికి పది కిలోమీటర్ల దూరంలో ఉన్న లక్ష్మీపురంలోని పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు వేయాలని అధికారులు చెబుతుండడంపై మండిపడుతున్నారు. తమ గ్రామానికి రహదారి సౌకర్యం ఉన్నా పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గత ఎన్నికల సమయంలో తమ గ్రామంలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఆ పంచాయతీ ప్రజలు వివిధ రూపాల్లో ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. అయితే సంబంధిత అధికారులు వివిధ కారణాలను చూపుతూ అక్కడ పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయకుండా మరో ప్రాంతంలో ఏర్పాటు చేశారు. దీంతో గత ఎన్నికల్లో ఆ ప్రాంతీయులు ఓటు వేసేందుకు ముందుకు రాలేదు. ఈసారైనా పంచాయతీ కేంద్రంలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తారని ఎంతో ఆశగా ఎదురు చూశారు. కానీ అధికారులు వివిధ కారణాలను చూపుతూ ఆ గ్రామంలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయకుండా లక్ష్మీపురం పంచాయతీ కేంద్రంలో ఏర్పాటు చేశారు. దీంతో ఈసారి కూడా ఎన్నికలను బహిష్కరిస్తామని ఆ గ్రామస్థులు చెబుతున్నారు.

10 కిలోమీటర్ల దూరంలో పోలింగ్ కేంద్రం

లక్ష్మీపురంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం తమ గ్రామానికి 10 కిలోమీటర్ల దూరంలో ఉందని గ్రామస్థులు వాపోతున్నారు. బుంగాపుట్టుకు గతంలో ఎటువంటి రోడ్డు సదుపాయం లేకపోవడం వల్ల వేరే ప్రాంతంలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసేవారు. ప్రస్తుతం గ్రామానికి పక్కాగా తారురోడ్డు, భవనాలున్నప్పటికీ ఇక్కడ పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయకపోవడం ... మిగతా 8వ పేజీలో

పలు చోట్ల భారీ వర్షం

సీలేరు, మే 12:

జిల్లాలో ఆదివారం పలు చోట్ల భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ తీవ్రత ఎక్కువగా ఉంది. మధ్యాహ్నం నుంచి కుండపోత వర్షం కురిసింది. జీకేవీధి మండలం సీలేరు, ధారకొండ పరిసర ప్రాంతాల్లో ఆదివారం ఉదయం నుంచి భానుడు ప్రతాపం చూపడంతో జనం అల్లాడిపోయారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి వాతావరణంలో మార్పులు చోటుచేసుకుని భారీ వర్షం కురిసింది. సీలేరు, ధారకొండ, దుప్పులవాడ ప్రాంతాల్లో రెండు గంటలకు పైగా ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది.

హుకుంపేటలో..

హుకుంపేట: మండలంలో ఆదివారం ఉదయం నుంచి ఎండ కాసింది. మధ్యాహ్నం 12 గంటల నుంచి భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం 3 గంటల వరకు ఏకధాటిగా వర్షం కురవడంతో రహదారులు జలమయమయ్యాయి. వర్షం వల్ల వాతావరణం చల్లబడడంతో జనం ఉపశమనం పొందారు.



సీలేరులో వర్షం

ఎన్నికల కోలాహలం

సోమవారం జరగనున్న పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తయ్యాయి. అనకాపల్లి, ఎలమంచిలి, నక్కపల్లిల్లో, నర్సీపట్నం, చోడవరం, మాడుగుల డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల వద్ద కోలాహలం నెలకొంది. ఎన్నికల సామగ్రితో సిబ్బంది ఆయా పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు.



నక్కపల్లి జూనియర్ కళాశాల నుంచి ఎన్నికల సామగ్రితో వెళుతున్న సిబ్బంది



మాడుగుల ఆర్‌సీఎం స్కూల్‌లో ఎన్నికల సామగ్రిని తీసుకువెళుతున్న సిబ్బంది



ఎలమంచిలిలోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి పోలింగ్ కేంద్రాలకు ఈవీఎం, సామగ్రితో వెళుతున్న ఎన్నికల సిబ్బంది



నక్కపల్లిలో బస్సుల్లో పోలింగ్ కేంద్రాలకు వెళుతున్న సిబ్బంది



నర్సీపట్నం డిగ్రీ కళాశాల భోజనాల కోసం బారులు తీరిన ఎన్నికల సిబ్బంది



చోడవరం నియోజకవర్గంలో దివ్యాంగులు ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రాలకు తరలించేందుకు సిద్ధం చేసిన వీల్ చైర్లు



కోటవురట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రానికి చేరుకున్న ఎన్నికల సిబ్బంది



పాయకరావుపేట పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లు చేసుకుంటున్న సిబ్బంది

భక్తులతో కిటకిటలాడిన నూకాంబిక ఆలయం



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

అనకాపల్లి టౌన్, మే 12: ఉత్తరాంధ్రలోనే ప్రఖ్యాతిగాంచిన స్థానిక నూకాంబిక అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. అమ్మవారి జాతర గత మంగళవారంతో ముగిసినప్పటికీ ఆలయానికి భక్తుల తాకిడి తగ్గలేదు. తెల్లవారుజామున ఆరు గంటలకు బాలాలయంలోని అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ ఆవరణతో పాటు పరిసర ప్రాంతాల్లో అధికసంఖ్యలో కుటుంబాలు వంటలు తయారుచేసి అమ్మవారికి నైవేద్యం పెట్టి కుటుంబ సమేతంగా సహపంక్తి భోజనం చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు తలెత్తకుండా ఆలయ ఈవో బండారు ప్రసాద్ చర్యలు చేపట్టారు. క్యూలో ఉన్న భక్తులకు చల్లటి తాగునీటిని అందజేశారు.

ఓటర్ స్లిప్ ఉంటేనే నజరానా

- అచ్యుతాపురంలో వైసీపీ రూ.1,500 పంపిణీ
- పోటాపోటీగా ఓటర్లకు తాయిలాలు
- ఆపై మద్యం బాటిళ్లు..

అచ్యుతాపురం, మే 12: ఓటు హక్కు స్లిప్ కోసం ఓటర్లు నానా యాతన పడుతున్నారు. ఓటరు కార్డులున్నా బీఎల్ఓ ఇచ్చే ఓటరు స్లిప్ కోసం తంటాలు పడుతున్నారు. ఇదంతా ఓటరు తమ ఓటు వినియోగించుకోవడానికి కాదు.. అధికార పార్టీ ఇచ్చే నజరానా కోసం.. పూడిమడకలో అధికార పార్టీ నేతలు ఓటుకు రూ.1,500 చొప్పున పంపిణీ చేస్తున్నారు. ఆధార్ కార్డు, ఓటర్ ఐడీ కార్డు ఉన్నా ఇవ్వడం లేదు. బీఎల్ఓ ఇచ్చిన ఓటరు సమాచార స్లిప్ ఉంటేనే రూ.1,500 ఇస్తున్నారు. దీంతో ఓటర్లు ఓటరు స్లిప్ కోసం బీఎల్ఓల వెంట పడుతున్నారు. ఇంతకాలం ఏంచేశారు. సోమవారం ఎన్నికలకు తాము బిజీగా ఉన్నామంటూ విసుక్కుంటున్నారు. వైసీపీ నాయకులు ఓటరు స్లిప్‌పై సంతకం చేసి దానిని సెల్‌లో ఫొటో తీసి ఇస్తున్నారు. ఇక గోవా మద్యం పంపిణీ చేస్తున్నారని 'ఆంధ్రజ్యోతి'లో ఆదివారం వార్త రావడంతో సీసాపై ఉన్న లేబిల్ తీసేసి మద్యం బాటిళ్లు పంపిణీ చేస్తున్నారు.



ఓటర్ల స్లిప్‌లు కోసం బీఎల్‌ఓల వద్ద గుమిగూడిన మత్స్యకారులు

పాయకరావుపేటలో..

నక్కపల్లి: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి సోమవారం పోలింగ్ జరగనుంది. ఎన్నికల్లో గెలుపు కోసం, అధికారాన్ని దక్కించుకోవడం కోసం ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు బరిలో వున్న అభ్యర్థులు సర్వ శక్తులు ఒడ్డుతున్నారు. పాయకరావుపేట నియోజకవర్గంలో తొలిసారిగా ఓటుకు రూ.1,000 చొప్పున పంపిణీ చేశారు. అధికార వైసీపీ సహా, ఎన్‌డీఏ కూటమి తరపున కూడా ఓటర్లకు నోట్లు పంపిణీ చేస్తున్నారు. మందుబాబులకు అవసరమైన మద్యాన్ని కూడా గ్రామాల్లో రెండు రోజులు ముందుగానే సిద్ధం చేసి, మందుబాబులకు అందజేస్తున్నారు. పాయకరావుపేట ఎస్సీ రిజర్వ్‌డ్ అసెంబ్లీ సెగ్మెంట్ బరిలో వైసీపీ అభ్యర్థిగా కంబాల జోగులు, ఎన్‌డీఏ కూటమి తరఫున (టీడీపీ) అభ్యర్థిని వంగలపూడి అనిత పోటీ చేస్తున్నారు. ఈ ఇరువురి మధ్య ప్రధాన పోటీ వుందని చెప్పాలి. ఓటర్లను ప్రసన్నం చేసుకోవడం కోసం శని,ఆదివారం రెండు రోజులూ ఆ పార్టీల నాయకులు డోర్ టూ డోర్ నగదు పంపిణీ చేయడం విశేషం.

అనకాపల్లిని ఐటీ హబ్‌గా మారుస్తా

- ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ వెల్లడి



కూటమి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్

కొత్తూరు(అనకాపల్లి), మే 12 : పార్లమెంట్ సభ్యునిగా విజయం సాధించిన తర్వాత అనకాపల్లిని ఐటీ హబ్‌గా మారుస్తానని బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అనకాపల్లి పార్లమెంట్ స్థానంతో పాటు 7 శాసనసభ నియోజకవర్గాల్లో ప్రముఖ సంస్థలతో సర్వే చేయించానన్నారు. అన్ని సర్వేల్లోనూ పార్లమెంటు స్థానంలోను, 7 శాసన సభ స్థానాల్లో ఉమ్మడి కూటమి అభ్యర్థులే విజయం సాధిస్తారని తేలిందన్నారు. ఇప్పటి వరకు 6 సర్వేల్లో ఇదే ఫలితం వచ్చిందన్నారు. విజయం సాధించిన వెంటనే ఈ ప్రాంత అభివృద్ధికి అమలు చేయబోయే ప్రణాళికలను వివరించారు. అనకాపల్లిని పారిశ్రామికంగా అభివృద్ధి చేయడానికి గాను వివిధ కంపెనీలతో పరిశ్రమల ప్రతినిధులతో చర్చించబోతున్నానన్నారు. తన నివాసాన్ని అనకాపల్లిలోనే ఏర్పరచుకొని ఈ ప్రాంత అభివృద్ధికి అహర్నిశలు కృషిచేస్తానని తెలిపారు. అనకాపల్లి వాసులకు సేవ చేయాలనే నా నిబద్ధతను పునరుద్ఘాటిస్తున్నానన్నారు.

దేవరాపల్లిలో పెనుగాలుల బీభత్సం

- పోలింగ్ కేంద్రం వద్ద కూలిన టెంట్లు
- రాత్రి ఏడున్నర గంటలకు చేరుకున్న ఎన్నికల సిబ్బంది



దేవరాపల్లిలోని పోలింగ్ కేంద్రం వద్ద నేలకూలిన టెంట్లు

దేవరాపల్లి, మే 12: వాతావరణంలో మార్పుల కారణంగా మండలంలో ఆదివారం ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. ఉదయం నుంచి ఎండ మండినప్పటికీ సాయంత్రం ఐదు గంటల ప్రాంతంలో ఆకాశం ఒక్కసారిగా మేఘావృతమైంది. అనంతరం పెనుగాలులు వీచాయి. ఈ ధాటికి పలుచోట్ల చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. దేవరాపల్లి ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన రెండు టెంట్లు ఒక్కసారిగా నేలకూలాయి. సుమారు అరగంట పాటు వర్షం కురిసి వెలసిన అనంతరం టెంట్లను సరిచేశారు. ఇదిలావుంటే, మాడుగుల నుంచి ఎన్నికల సిబ్బంది రాత్రి ఏడున్నర గంటలకు మండల కేంద్రం దేవరాపల్లి చేరుకున్నారు. వాలాబు, చింతలపూడి, గర్శింగి పంచాయతీలకు ఎన్నికల సిబ్బంది చేరుకోవడం కాస్త ఆలస్యమైంది.



రాత్రి 7.30గంటలకు పోలింగ్ కేంద్రానికి చేరుకుంటున్న ఎన్నికల సిబ్బంది

అరకు, కొత్తవలస సెక్షన్‌లలో డీఆర్‌ఎం పర్యటన



శివలింగపురం స్టేషన్‌లో సిబ్బందితో మాట్లాడుతున్న డీఆర్‌ఎం సౌరభ్‌ప్రసాద్

విశాఖపట్నం, మే 12: వాల్తేరు డివిజన్ పరిధిలోని అరకు, కొత్తవలస సెక్షన్‌ల పరిధిలో డీఆర్‌ఎం సౌరభ్‌ప్రసాద్ ఆదివారం పర్యటించి అభివృద్ధి పనుల పురోగతిని పరిశీలించారు. అలాగే, స్టేషన్లలో ప్రయాణికుల మౌలిక సదుపాయాల కల్పనపై రూపొందించిన ప్రణాళికలను సమీక్షించారు. డబ్లింగ్ పనులు, సొరంగాలు, పాయింట్లు, క్రాసింగ్‌ల పురోగతి, బ్రిడ్జిల నిర్వహణ కార్యకలాపాలు, సైడ్ వాల్ రక్షణ, భద్రతా చర్యలను పరిశీలించారు. నీటి ప్రవాహక ప్రాంతాలలో బురదతో వచ్చే ప్రమాదాలను నివారణకు చేపట్టాల్సిన ప్రత్యేక చర్యలపై అధికారులకు సూచనలు చేశారు. అక్కడ నుంచి శిలింగపురం, తాడి స్టేషన్లలో తనిఖీలు చేపట్టారు. ఈ పర్యటనలో ఏడీఆర్‌ఎంలు సుధీర్‌కుమార్ గుప్తా, మనోజ్‌కుమార్ సాహు, ఇతర బ్రాంచి అధికారులు పాల్గొన్నారు.

అల్లూరి పార్కు పై నిర్లక్ష్యపు నీడ

ఐదేళ్లుగా పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం

- నిర్వహణ కొరవడి శిథిలావస్థకు చేరిన కట్టడాలు
- సమాధులున్న భవనం శ్లాబ్ నుంచి ఊడి పడుతున్న పెచ్చులు
- సందర్శకులకు అడుగడుగునా అసౌకర్యాలు

కృష్ణాదేవిపేట, మే 12: స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు సమాధులున్న గొలుగొండ మండలం కృష్ణాదేవిపేటలోని అల్లూరి పార్కు నిర్వహణపై నిర్లక్ష్యపు నీడలు అలముకున్నాయి. అధికారులు, పాలకులు పట్టించుకోకపోవడంతో ఐదేళ్లుగా ఇక్కడి కట్టడాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. అల్లూరి జయంతి, వర్ధంతి కార్యక్రమాలకు హాజరైన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు ఇతర ప్రజాప్రతినిధులు ఈ పార్కు అభివృద్ధికి నిధులు ప్రకటించడం తప్ప, విడుదల కావడం లేదు. గత టీడీపీ ప్రభుత్వ హయంలో మంత్రి ఉండే చింతకాయల అయ్యన్నపాత్రుడు సుమారు కోటి రూపాయల నిధులు మంజూరు చేయించి కొంతమేర పార్కును అభివృద్ధి చేశారు. కానీ ఇక్కడ నిర్వహణ పనులను వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో పార్కులోని కట్టడాలు చాలా వరకు అధ్వానంగా మారాయి.



రంగులు వెలిసి కళావిహీనంగా కనిపిస్తున్న పార్కు ముఖద్వారం

పార్కులో సమస్యలు ఇవీ..

పార్కులో పర్యాటకులు కూర్చొనేందుకు అనువుగా ఏర్పాటు చేసిన మూడు షెడ్ల పైకప్పులు రంధ్రాలు పడ్డాయి. కొన్ని పెనుగాలులకు ఎగిరిపోయాయి. రహదారి, మెట్లు, ప్రహరీగోడలు బీటలు వారాయి. పలుచోట్ల టైల్స్ ఊడిపోయి గోతులు ఏర్పడ్డాయి. పార్కులో సమాధులున్న మందిరం శ్లాబ్ నుంచి పెచ్చులూడి పడుతున్నాయి. మ్యూజియంలోని వీడియో థియేటర్ మరమ్మతుకు గురైంది. అలాగే రంగులు వెలిసిపోయి పార్కు ముఖద్వారం కళావిహీనంగా మారింది. దీంతో ఇక్కడికి వచ్చే పర్యాటకులు అసౌకర్యానికి గురవుతున్నారు.



పార్కులో పాడైన షెడ్లు



అల్లూరి విగ్రహం వద్ద స్తంభం నుంచి పెచ్చులూడి పడుతున్న దృశ్యం

కార్యరూపం దాల్చని మంత్రుల హామీలు

ఐదేళ్లుగా పార్కు అభివృద్ధి కోసం వైసీపీ ప్రభుత్వంలో మంత్రులు చేసిన ప్రకటనలు కార్యరూపం దాల్చడం లేదు. గత పర్యాటక శాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు రూ.50 లక్షల నిధులు ప్రకటించినప్పటికీ పనులు ప్రారంభానికి నోచుకోలేదు. అలాగే, 2022లో అల్లూరి జయంతి సందర్భంగా ఏర్పాటైన కార్యక్రమానికి విచ్చేసిన గిరిజన సంక్షేమ శాఖా మంత్రి రాజన్నదొర రూ.66 లక్షల నిధులు ప్రకటించి రెండేళ్లు గడుస్తున్నా ఒక్క రూపాయి కూడా వెచ్చించి పనులు చేపట్టలేదు.

సంరక్షకులకు నెలల తరబడి అందని వేతనాలు

ఇదిలావుంటే, పార్కులో పనిచేస్తున్న ముగ్గురు సంరక్షకులకు వైసీపీ ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుంచి సకాలంలో వేతనాలు అందడం లేదు. ప్రస్తుతం 42 నెలల వేతనాలు చెల్లించకపోగా, ఏడాది క్రితం ముగ్గురు ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని నియమించారు. బకాయి వేతనాల కోసం సదరు సంరక్షకులు అధికారులు, ప్రజాప్రతినిధులను వేడుకుంటున్నా ఫలితం లేకపోతోందని అంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం అల్లూరి పార్కు అభివృద్ధిపై దృష్టి సారించాల్సిందిగా ఈ ప్రాంత ప్రజలతో పాటు పర్యాటకులు కోరుతున్నారు.



అల్లూరి, గంటందొర సమాధులున్న కట్టం దుస్థితి



పెచ్చులూడిన టైల్స్

ఎన్‌ఏడీ ఫ్లైఓవర్‌పై ప్రమాదం

- డివైడర్‌ను ఢీకొన్న ద్విచక్ర వాహనం
- ఫ్లైఓవర్ పైనుంచి కిందకు పడిపోయిన యువకులు
- ఇద్దరి మృతి, మరొకరికి తీవ్ర గాయాలు

మర్రిపాలెం (విశాఖపట్నం), మే 12: మితిమీరిన వేగం ఇద్దరు యువకుల ప్రాణాలను బలిగొంది. మరొకరు తీవ్రగాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. నగరంలోని ఎన్‌ఏడీ ఫ్లై ఓవర్‌పై ఆదివారం తెల్లవారుజామున ఈ ప్రమాదం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు...విశాఖ నగరంలోని దొండపర్తి, కంచరపాలెం ప్రాంతాలకు చెందిన అరెల్లి పవన్‌కుమార్ (23), తానవరపు కుమార్ (24), గాంధీ (22) గాజువాక నుంచి ద్విచక్ర వాహనంపై ఆదివారం తెల్లవారుజామున నగరంలోకి వస్తున్నారు. వీరి బైక్ ఎన్‌ఏడీ ఫ్లైఓవర్ పైకి వచ్చేసరికి అదుపుతప్పి నేరుగా రోటరీ డివైడర్‌ను బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో ముగ్గురు యువకులు ఫ్లైఓవర్ పైనుంచి కిందనున్న రోడ్డుపై పడిపోయారు. దీంతో ఆరెల్లి పవన్‌కుమార్ (23) తలకు తీవ్ర గాయాలై ఘటనా స్థలంలోని మృతి చెందగా, తానవరపు కుమార్, గాంధీ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తక్షణం స్పందించి 108 వాహనానికి సమాచారం అందించారు. క్షతగాత్రులను కేజీహెచ్‌కు తరలించగా కొద్దిసేపటికే తానవరపు కుమార్ మృతిచెందాడు. ప్రస్తుతం ఆస్పత్రిలో గాంధీ చికిత్స పొందుతున్నాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించారు. మితిమీరిన వేగమే ప్రమాదానికి కారణమని గుర్తించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సీఐ చక్రధరరావు ఆధ్వర్యంలో దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	133.00
లైవ్ ధర	153.00
విత్ స్కిన్	276.00
స్కిన్ లెస్	286.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

విశాఖ లోక్‌సభ బరిలో 33 మంది



ఎం.శ్రీభరత్ | బొత్స ఝాన్సీ | పి.సత్యారెడ్డి

విశాఖ లోక్‌సభస్థానం నుంచి రాష్ట్రంలోనే అత్యధికంగా 33 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నారు. తెలుగుదేశం, వైసీపీతో పాటు కాంగ్రెస్, బీఎస్పీ, సమాజ్‌వాదీ పార్టీ, దళిత బహుజనపార్టీ, పిరమిడ్ పార్టీతో కలిపి 18 మంది, మరో 15 మంది స్వతంత్రులు బరిలో నిలిచారు. పి.సత్యారెడ్డి (కాంగ్రెస్), పెదపెంకి శివప్రసాదరావు (బీఎస్పీ), ఎ.విజయభాస్కర్ (ఇండియా ప్రజాబంధు), అచ్చుత బాలాజీ యాదవ్ (భారత్ చైతన్య యువజన), కొంగరపు గణపతి (రిపబ్లికన్), జి.జగదీశ్వరరావు (జైమహాభారత్), జి.దుర్గాప్రసాద్ (భారతీయ రాష్ట్రీయ దళ్), జి.రాజేష్ (నవతరం), చింతాడ సూర్య (నవ భారత్ నిర్మాణ), జాలాది విజయ్ (సమాజ్‌వాదీ పార్టీ), టి.సాయిముకుంద (ప్రజాప్రస్థానం), కేఏ పాల్ (ప్రజాశాంతి), బాన్న రమేష్ (దళిత బహుజన పార్టీ), బి.చల మాజీ (నవరంగ కాంగ్రెస్), వీఎస్. సత్యనారాయణ (రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్), పి.సత్యవాణి (పిరమిడ్)తో పాటు మరో 15 మంది స్వతంత్రులు పోటీ చేస్తున్నారు. కాగా తెలుగుదేశం పార్టీ నుంచి ఎం.శ్రీభరత్, వైసీపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ మధ్యే ప్రధాన పోటీ నెలకొంది. లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో జిల్లాలోని జిల్లాలో ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలు, విజయనగరం జిల్లాలోని శృంగవరపుకోట అసెంబ్లీ స్థానం ఉంది.

అరకు పార్లమెంట్‌కు త్రిముఖ పోరు



కొత్తపల్లి గీత | తనూజారాణి | పి.అప్పలనర్స

అరకు పార్లమెంట్ నియోజకవర్గ స్థానంలో త్రిముఖ పోటీ నెలకొంది. బరిలో 13 మంది అభ్యర్థులుండగా, ప్రధానంగా కూటమి అభ్యర్థి కొత్తపల్లి గీత, వైసీపీ అభ్యర్థి తనూజారాణి మధ్య హోరాహోరీ పోటీ సాగుతోంది. ఇండియా కూటమి నుంచి సీపీఎం అభ్యర్థిగా బరిలోకి దిగిన పి.అప్పలనర్స గట్టిపోటీ ఇస్తారంటున్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు, అరకులోయ, రంపచోడవరం పార్వతీపురం మన్యం జిల్లాలోని సాలూరు, కురుపాం, పార్వతీపురం, పాలకొండ అసెంబ్లీ స్థానాలు నియోజకవర్గం పరిధిలో ఉన్నాయి. మొత్తం 15,54,633 మంది ఓటర్లున్నారు. వారిలో పురుషులు 7,53,709 మంది, మహిళలు 8,00,813 మంది, ఇతరులు 111 మంది ఉన్నారు. మరో పది మంది ఇతర పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు.

బరిలో వీరులు

మరి కొద్ది నిమిషాల్లో సార్వత్రిక ఎన్నికల సమరంలో కీలక ఘట్టం పోలింగ్ ప్రక్రియ ప్రారంభం కానుంది. షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచి సుమారు 50 రోజులుగా ఎన్నికల సందడి మొదలై, అభ్యర్థుల ఎంపిక తరువాత ఉధృత స్థాయికి చేరుకుంది. ప్రస్తుత ప్రజా ప్రతినిధులు, ఆశావహులు ఇలా... ఒక్కో పార్టీలో ఎంతో మంది పోటీపడి టికెట్లు దక్కించుకున్నారు. వారితో పాటు స్వతంత్రులు కూడా తమ భవితవ్యం తేల్చుకునేందుకు రంగంలో నిలిచారు. మొత్తమ్మీద ప్రక్రియ పూర్తై... చివరకు పోటీలో నిలిచిన వారిలో విజేతలెవరో సోమవారం ఈవీఎంలలో నిక్షిప్తం కానుంది. ఉమ్మడి విశాఖ జిల్లాలోని పార్లమెంటు నియోజకవర్గాలతో పాటు మొత్తం 15 శాసనసభ నియోజకవర్గాల్లో పోటీలో ఉన్న అభ్యర్థులు, ప్రధాన పోటీ దారుల వివరాలు పాఠకుల కోసం...

- ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్



అనకాపల్లి ఎంపీ పీఠానికి ద్విముఖ పోరు!



సీఎం రమేశ్ | బూడి ముత్యాలునాయుడు



వేగి వెంకటేశ్

అనకాపల్లి ఎంపీ స్థానానికి 12 మంది అభ్యర్థులు బరిలో నిలిచినా ప్రధాన పోరు బీజేపీ అభ్యర్థి సీఎం రమేశ్, వైసీపీ అభ్యర్థి బూడి ముత్యాలునాయుడు మధ్యే నెలకొంది. కాంగ్రెస్ పార్టీ నుంచి వేగి వెంకటేశ్ పోటీలో ఉన్నారు. పార్లమెంట్ పరిధిలో అనకాపల్లి, నర్సీపట్నం, చోడవరం, మాడుగుల, ఎలమంచిలి, పెందుర్తి, పాయకరావుపేట అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. కూటమి సీఎం రమేశ్‌ను రంగంలోకి దింపడంతో వైసీపీ అదే సామాజికవర్గానికి చెందిన బూడి ముత్యాలు నాయుడును బరిలో నిలిపింది.

'దక్షిణం'లో రసవత్తర పోరు



వంశీకృష్ణ శ్రీనివాస్ | వాసుపల్లి గణేష్‌కుమార్ | వాసుపల్లి సంతోష్‌కుమార్

విశాఖ దక్షిణ నియోజకవర్గం బరిలో 16 మంది నిలిచినప్పటికీ జనసేన అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్, వైసీపీ అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్ మధ్యనే పోటీ నెలకొంది. వైసీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ బరిలో నిలిచారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ నుంచి వాసుపల్లి సంతోష్‌కుమార్, జైభారత్ పార్టీ నుంచి ఎర్రంశెట్టి సురేష్‌కుమార్, బీఎస్పీ నుంచి కదిరిరాము, మరో 11 మంది స్వతంత్ర అభ్యర్థులు పోటీలో ఉన్నారు.

'పశ్చిమ' బరిలో 13 మంది



పీజీవీఆర్ నాయుడు (గణబాబు) | ఆడారి ఆనంద్‌కుమార్ | అత్తిలి విమల

విశాఖ పశ్చిమ నియోజకవర్గంలో 13 మంది అభ్యర్థులు బరిలో ఉన్నప్పటికీ ప్రధాన పోరు టీడీపీ, వైసీపీ మధ్యే నెలకొంది. ఇక్కడ తెలుగుదేశం పార్టీ (కూటమి) అభ్యర్థిగా సిటింగ్ ఎమ్మెల్యే పీజీవీఆర్ నాయుడు (గణబాబు) బరిలో ఉన్నారు. వైసీపీ అభ్యర్థిగా విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్ పోటీలో ఉన్నారు. కాగా సీపీఐ అభ్యర్థిగా అత్తిలి విమల, బీఎస్పీ నుంచి అతుకుంశెట్టి రామచంద్రరావు, భారత చైతన్య యువజన పార్టీ నుంచి బొట్టా కోటేశ్వరరావు, జైభారత్ నేషనల్ పార్టీ నుంచి వెంకట గణేశ్ జగ్గుమంత్రి, సమాజ్‌వాద్ పార్టీ నుంచి రవికుమార్ వెలగాడ, జాతీయ జనసేన పార్టీ నుంచి మండపాటి శ్రీనివాసరాజు, మరో ఐదుగురు స్వతంత్ర అభ్యర్థులు పోటీ చేస్తున్నారు.

అనకాపల్లి బరిలో 12 మంది



కొణతాల రామకృష్ణ | మలసాల భరత్‌కుమార్ | ఐఆర్ గంగాధర్

జిల్లా కేంద్రమైన అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో 12 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నుంచి మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ, వైసీపీ నుంచి మలసాల భరత్‌కుమార్ పోటీలో ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి ఐఆర్ గంగాధర్, బహుజన సమాజ్ పార్టీ నుంచి సూదికొండ మాణిక్యాలరావు, జై భారత్ నేషనల్ పార్టీ నుంచి కనిశెట్టి సురేష్‌బాబు, సమాజ్‌వాదీ పార్టీ నుంచి ఒమ్మి వెంకటయాదవ్, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి పొలమరశెట్టి అంబికాదేవి, ప్రజాప్రస్థానం నుంచి తోట వెంకటసాయిముకుంద, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి దొమ్మేసి అప్పారావు, ప్రేమ్ జనతాదళ్ నుంచి సూరిశెట్టి వీవీ రామచంద్రరావు, ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు బరిలో ఉన్నారు.

చోడవరంలో ముఖాముఖీ



కేఎస్ఎన్ఎస్ రాజు | కరణం ధర్మశ్రీ | జగతా శ్రీనివాసరావు

అనకాపల్లి జిల్లాలో అతి తక్కువగా ఆరుగురు అభ్యర్థులు పోటీపడుతున్న చోడవరం నియోజకవర్గంలో నాలుగోసారి టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు, వైసీపీ అభ్యర్థిగా ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తలపడుతున్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పాయకరావుపేటకు చెందిన జగతా శ్రీనివాసరావు, బీఎస్పీ అభ్యర్థిగా వేగి మహాలక్ష్మినాయుడు, సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ అభ్యర్థిగా సవరాల గణేశ్, ఇండిపెండెంట్ అభ్యర్థిగా పేరిచర్ల వివేకరాజు బరిలో ఉన్నారు.

తూర్పులో ముఖాముఖి



వెలగపూడి రామకృష్ణబాబు | ఎంవీవీ సత్యనారాయణ | గుత్తుల శ్రీనివాసరావు

విశాఖ తూర్పు నియోజకవర్గంలో మొత్తం 14మంది పోటీలో ఉన్నారు. కూటమి అభ్యర్థిగా సిటింగ్ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు బరిలో ఉన్నారు. వైసీపీ నుంచి విశాఖ లోక్‌సభ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ పోటీ చేస్తున్నారు. పోటీలో 15మంది ఉన్నప్పటికీ వెలగపూడి, ఎంవీవీ సత్యనారాయణ మధ్యే ప్రధాన పోటీ నెలకొంది. గుత్తుల శ్రీనివాసరావు(కాంగ్రెస్), జోసఫ్ పీటర్ (బీఎస్పీ), అదపాక దాలిరాజు (నవభారత నిర్మాణ పార్టీ), కె. గణపతి (రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా), తోట వెంకట సాయి ముకుందు (ప్రజాప్రస్థానం పార్టీ), యడ్ల వేణుగోపాలకృష్ణ (భారతీయ చైతన్య యువజన పార్టీ), ఇ.హైమావతి (పిరమిడ్ పార్టీ), మరో ఐదుగురు ఇండిపెండెంట్లు పోటీ చేస్తున్నారు.

గాజువాకలో ద్విముఖ పోటీ



పల్లా శ్రీనివాసరావు | గుడివాడ అమర్‌నాథ్ | ఎం.జగ్గు నాయుడు

గాజువాక నియోజకవర్గంలో ద్విముఖ పోటీ నెలకొంది. మొత్తం 14 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచారు. తెలుగుదేశం పార్టీ (కూటమి) అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు, వైసీపీ అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ మధ్యే ప్రధాన పోటీ నెలకొంది. ఇంకా ఇండియా కూటమి నుంచి సీపీఎం అభ్యర్థిగా ఎం.జగ్గునాయుడు, ప్రజాశాంతి నుంచి కేఏ పాల్, ఎన్.అప్పారావు (బీఎస్పీ), టి.అక్కయ్య (లోకతంత్రిక్ జనతాదళ్), శ్యాముల్ జాన్ ధర్మరాజు రాయపాటి (దళిత బహుజన), తలపుల శైలజ (ప్రజాప్రస్థానం), కాండ్రేగుల ఆదినారాయణ (జై మహాభారత్), బత్తుల నీలకంఠం (నవభారత్ నిర్మాణ సేవ), సుంకర సారజ్యోతి (నవతరం పార్టీ), మరో ముగ్గురు స్వతంత్ర అభ్యర్థులు బరిలో ఉన్నారు.

నర్సీపట్నంలో గట్టి పోటీ!



చింతకాయల అయ్యన్నపాత్రుడు | పెట్ల ఉమా శంకర్ గణేశ్ | రుత్తల శ్రీరామమూర్తి

నర్సీపట్నంలో ఎనిమిది మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థిగా చింతకాయల అయ్యన్నపాత్రుడు, వైసీపీ అభ్యర్థిగా పెట్ల ఉమాశంకర్ గణేశ్ తలపడుతున్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా రుత్తల శ్రీరామమూర్తి, బీఎస్పీ అభ్యర్థిగా బొట్టా నాగరాజు, జై భీంరావు భారత్ పార్టీ అభ్యర్థిగా నేతల నాగేశ్వరరావు, భారత చైతన్య యువజన పార్టీ నుంచి జోగా చంద్రమౌళి, ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ప్రధానంగా టీడీపీ, వైసీపీ అభ్యర్థుల మధ్యే పోటీ జరగనుంది.

మాడుగులకు కొత్త ముఖాలు



బండారు సత్య నారాయణమూర్తి | ఈర్లె అనురాధ | బొడ్డు బుచ్చి సత్యశ్రీనివాసరావు

మాడుగులలో తొమ్మిది మంది పోటీలో ఉన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థిగా బండారు సత్యనారాయణమూర్తి తలపడుతున్నారు. వైసీపీ నుంచి ఈర్లె అనురాధ పోటీ పడుతున్నారు. ఈమె డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడుకుమార్తె. ప్రస్తుతం కె.కోటపాడు జడ్పీటీసీ సభ్యురాలు. వీరిద్దరి మధ్య గట్టిపోటీ ఉంది. కాంగ్రెస్ నుంచి బొడ్డు బుచ్చి సత్యశ్రీనివాసరావు, ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు తొలి భార్య కుమారుడు బూడి రవికుమార్, మల్లారపు లోవ, మతల ఆదినాయుడు స్వతంత్ర అభ్యర్థులుగా పోటీచేస్తుండగా, బీఎస్పీ, ఇతర పార్టీల నుంచి కరణం తిరుపతిరావు తాళ్ల రవి, లెక్కల ఈశ్వరరావు బరిలో నిలిచారు.

ఎలమంచిలిలో పోటీ పోటీ



సుందరపు విజయకుమార్ | యూవీ రమణ మూర్తిరాజు | తనకాల అనంత రామ నరసింగరావు

ఎలమంచిలి నియోజకవర్గ బరిలో పది మంది అభ్యర్థులు నిలిచారు. ఎన్డీఏ నుంచి సుందరపు విజయకుమార్, వైసీపీ అభ్యర్థిగా యూవీ రమణమూర్తిరాజు పోటీ చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి తనకాల అనంత రామనరసింగరావు, బీఎస్పీ నుంచి లంబా శ్రీనివాసరావు, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి బి.అమ్మాజమ్మ, నవరంగ్ కాంగ్రెస్ పార్టీ నుంచి అరుణ్ కుమార్ సుందరపు, జై భారత్ నేషనల్ పార్టీ నుంచి దాడి పూర్ణచంద్రరావు, రిఫార్మ్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి బోజా నాగేశ్వరరావు, ఇద్దరు స్వతంత్రులు పోటీలో ఉన్నారు.

'నార్త్'లో ముక్కోణం



విష్ణుకుమార్‌రాజు | కేకే రాజు | వీవీ లక్ష్మీనారాయణ

విశాఖ ఉత్తర నియోజకవర్గంలో మొత్తం 15 మంది పోటీలో ఉన్నారు. కూటమి అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే పెనుమత్స విష్ణుకుమార్‌రాజు బరిలో ఉన్నారు. అధికార వైసీపీ నుంచి కేకే రాజు పోటీ చేస్తున్నారు. జై భారత్ పార్టీ వ్యవస్థాపకులు, సీబీఐ మాజీ జేడీ వీవీ లక్ష్మీనారాయణ ఇక్కడి నుంచి పోటీ చేస్తున్నారు. గడిచిన ఎన్నికల్లో జనసేన పార్టీ తరఫున విశాఖ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసిన ఆయన.. ఆ తరువాత జరిగిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో సొంతంగా పార్టీ ఏర్పాటు చేసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి ఎల్.రామారావు, సమాజ్‌వాదీ పార్టీ నుంచి గుంపుల శరత్‌బాబు, నవభారత్ నిర్మాణ సేవ పార్టీ నుంచి చింతాడ సూర్యం, జాతీయ జనసేన పార్టీ నుంచి పి.జగదీశ్, మరో ఏడుగురు ఇండిపెండెంట్ అభ్యర్థులుగా పోటీలో ఉన్నారు.

భీమిలిలో మిత్రుల యుద్ధం



గంటా శ్రీనివాసరావు | ముత్తంశెట్టి శ్రీనివాసరావు | అద్దాల వెంకట వర్మరాజు

భీమిలి నియోజకవర్గంలో మొత్తం 15 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. వీరిలో చిరకాల మిత్రులు వైసీపీ నుంచి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, తెలుగుదేశం నుంచి గంటా శ్రీనివాసరావుల మధ్య ప్రధాన పోటీ నెలకొంది. ఇంకా కాంగ్రెస్ నుంచి అద్దాల వెంకట వర్మరాజు, బీఎస్పీ నుంచి భాగం గోపాలరావు, జై భారత్ నేషనల్ పార్టీ నుంచి అనిల్‌కుమార్ ఇలిపిల్లి, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థిగా కోలా హరిబాబు, జాతీయ జనసేన పార్టీ అభ్యర్థిగా గంటా శ్రీనివాసరావు, సమాజ్ వాదీ పార్టీ అభ్యర్థిగా రాజు చోడిపల్లి, మరో ఏడుగురు స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేస్తున్నారు.

అరకులో బహుముఖం



పాంగి రాజారావు | రేగం మత్స్యలింగం | శెట్టి గంగాధర్‌స్వామి

అరకులో బహుముఖ పోటీ నెలకొంది. మొత్తం 17 మంది అభ్యర్థులు బరిలో ఉండగా, ప్రధానంగా ఐదుగురి మధ్య పోటీ నెలకొంది. టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి నుంచి పాంగి రాజారావు, వైసీపీ నుంచి రేగం మత్స్యలింగం బరిలో నిలిచారు. ప్రధానంగా వీరిద్దరి మధ్య హోరాహోరీ పోటీ సాగుతోంది. శెట్టి గంగాధర్‌స్వామి (కాంగ్రెస్), లకే రాజారావు (బీఎస్పీ) స్వతంత్ర అభ్యర్థి సీవేరి అబ్రహం, లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ నుంచి కిల్లో అనిల్‌కుమార్, దండకారణ్య పార్టీ నుంచి చుంచు రాజుబాబు గోండ్వానా, జై భారత్ జాతీయ పార్టీ నుంచి బురిడి ఉపేంద్ర, భారత్ ఆదివాసీ పార్టీ నుంచి డాక్టర్ రామకృష్ణ పుచ్చపుండి, మరో ఎనిమిది మంది స్వతంత్ర అభ్యర్థులు పోటీలో ఉన్నారు.

'పేట'లో ద్విముఖ పోటీ



వంగలపూడి అనిత | కంబాల జోగులు | డాక్టర్ బోని తాతారావు

పాయకరావుపేట ఎస్సీ నియోజకవర్గంలో తొమ్మిది మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ప్రధానంగా టీడీపీ, వైసీపీ మధ్య పోటీ నెలకొంది. ఎన్డీఏ కూటమి అభ్యర్థినిగా తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనిత, వైసీపీ నుంచి విజయనగరం జిల్లా రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులును పోటీ చేస్తుండగా, కాంగ్రెస్ పార్టీ నుంచి డాక్టర్ బోని తాతారావు, బహుజన సమాజ్ పార్టీ నుంచి కాకర నరసింహారావు, దళిత బహుజన పార్టీ నుంచి వడ్డమూరి కృష్ణస్వరూప్, జై భారత్ నేషనల్ పార్టీ నుంచి దూలపల్లి నాగేశ్వరరావు, ప్రబుద్ధ రిపబ్లికన్ పార్టీ నుంచి పతివాడ రామకృష్ణ, ఇద్దరు స్వతంత్రులు పోటీలో ఉన్నారు.

పాడేరులో రసవత్తరం



గిడ్డి ఈశ్వరి | మత్స్యరాస విశ్వేశ్వరరాజు | సతకా బుల్లిబాబు

పాడేరు అసెంబ్లీ స్థానంలో మొత్తం 16 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. గిడ్డి ఈశ్వరి (టీడీపీ), మత్స్యరాస విశ్వేశ్వరరాజు (వైసీపీ), సుర్ల అప్పారావు (బీఎస్‌పీ), సతకా బుల్లిబాబు (కాంగ్రెస్), కింటుకూరి జోసెఫ్ (ఇండియా ప్రజాబంధు పార్టీ), మినుముల రాంబాబు (సమాజ్ వాదీ పార్టీ), కిల్లో రంగారావు (భారత చైతన్య పార్టీ), దమంతి నాగేశ్వరరావు (జైభారత్ నేషనల్ పార్టీ), బొంకు అర్జునరావు (జై మహాభారత్ పార్టీ), మరో ఏడుగురు స్వతంత్రులు పోటీ చేస్తున్నారు.

పెందుర్తిలో నువ్వా... నేనా?



పంచకర్ల రమేశ్‌బాబు | అన్నంరెడ్డి అదీప్‌రాజ్ | పిరిడి భగత్

పెందుర్తి నియోజకవర్గంలో మొత్తం 14 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. తెలుగుదేశం, జనసేన, బీజేపీ, కూటమి అభ్యర్థిగా జనసేన పార్టీకి చెందిన మాజీ ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు బరిలో ఉన్నారు. వైసీపీ నుంచి సిటింగ్ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పోటీ చేస్తున్నారు. కాగా కాంగ్రెస్ పార్టీ నుంచి పిరిడి భగత్, బీఎస్పీ నుంచి బంగారి రమణ, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి ఈత రోజ, నేషనలిస్ట్ జనశక్తి నుంచి ఏలూరు వెంకటరమణ జైభారత్ నేషనల్ పార్టీ నుంచి కన్నేపల్లి మహదేవ్, నవరంగ్ కాంగ్రెస్ నుంచి పి.రమేశ్ నాయుడు, సమాజ్‌వాదీ పార్టీ నుంచి బోలెం వెంకట మురళీమోహన్, మరో ఐదుగురు స్వతంత్రులుగా బరిలో ఉన్నారు.

భారీగా యువ ఓటర్లు

విశాఖపట్నం, మే 12 (ఆంధ్రజ్యోతి):



రానున్న సార్వత్రిక ఎన్నికల్లో తొలిసారి ఓటు హక్కు వినియోగించుకోనున్న యువతీయువకుల సంఖ్య విశాఖపట్నం జిల్లాలో భారీగానే ఉంది. అవగాహన కార్యక్రమాలు, ప్రత్యేక డ్రైవ్‌ల ఫలితంగా భారీసంఖ్యలో యువత ఓటు హక్కును నమోదు చేయించుకున్నారు. వీరంతా సోమవారం ఓటు వేసేందుకు సిద్ధమవుతున్నారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల పరిధిలో 49,935 మంది కొత్తగా ఓటు హక్కును పొందారు. మొత్తం ఓటర్లతో పోలిస్తే వీరి సంఖ్య 2.48 శాతంగా ఉంది. నియోజకవర్గాల వారీగా పరిశీలిస్తే...కొత్త ఓటర్లు భీమిలిలో 9,469 మంది నమోదు కాగా, వీరిలో 5,200 మంది పురుషులు, 4,269 మంది మహి ళలు ఉన్నారు. అలాగే విశాఖపట్నం తూర్పు నియోజకవర్గంలో 7,499 మందిలో పురుషులు 3,912 మంది, మహిళలు 3,586 మంది, దక్షిణ నియోజకవర్గంలో 4,479 మందిలో 2,396 మంది పురుషులు, 2,083 మంది మహిళలు, నార్త్ నియోజకవర్గంలో 6,617 మంది కొత్త ఓటర్లు ఉండగా 3,553 మంది పురుషులు, 3,064 మంది మహిళలు, పశ్చిమ నియోజకవర్గంలో 5,437 మందిలో 2,863 మంది పురుషులు, మహిళలు 2,573 మంది ఉన్నారు. గాజువాక నియోజకవర్గంలో 8,408 మంది యువ ఓటర్లు ఉండగా, వీరిలో పురుషులు 4,523 మంది, మహిళలు 3,885 మంది, పెందుర్తి నియోజకవర్గంలో 8,026 మందిలో పురుషులు 4,356 మంది, మహిళలు 3,670 మంది ఉన్నారు.

రెండు శాతానికిపైగానే..

విభజిత విశాఖ జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లోనూ రెండు శాతానికి పైగానే తొలిసారి ఓటు హక్కు వినియోగించుకోబోతున్నారు. భీమిలి, పెందుర్తి నియోజకవర్గాల్లో అత్యధికంగా 2.6 శాతం మంది ఓటు హక్కు వినియోగించుకుంటుండగా, విశాఖ తూర్పులో 2.56 శాతం మంది యువత ఓటు హక్కు వినియోగించుకునేందుకు సిద్ధమవుతున్నారు. విశాఖ పశ్చిమలో 2.54 శాతం మంది, గాజువాకలో 2.52 శాతం మంది, విశాఖ ఉత్తరంలో 2.31 శాతం మంది, విశాఖ దక్షిణలో 2.06 శాతం మంది ఓటు హక్కు వినియోగించుకునేందుకు యువ ఓటర్లు సిద్ధమవుతున్నారు.

విశాఖ జిల్లాలో 2.48 శాతం మంది మొదటిసారి ఓటు హక్కు వినియోగం

- జిల్లా వ్యాప్తంగా 20,12,373 మంది ఓటర్లు... వీరిలో 18-19 ఏళ్లలోపు యువతీయువకులు 49,935 మంది
- అత్యధికంగా భీమిలిలో 9,469 మంది, గాజువాకలో 8,408, పెందుర్తిలో 8,026 మంది ఓటర్లు
- 'నార్త్'లో అన్నింటి కంటే తక్కువగా 4,479 మంది

నియోజక వర్గాలు వారీగా వివరాలు..

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ట్రాన్స్‌జెండర్లు	తొలి ఓటర్లు	శాతం
భీమిలి	1,78,068	1,84,928	17	9,469	2.6
విశాఖ తూర్పు	1,42,546	1,49,639	21	7,499	2.56
విశాఖ దక్షిణ	1,06,454	1,10,282	34	4,479	2.06
విశాఖ ఉత్తర	1,40,810	1,44,956	23	6,617	2.31
విశాఖ పశ్చిమ	1,05,207	1,08,221	11	5,437	2.54
గాజువాక	1,67,125	1,66,473	13	8,408	2.52
పెందుర్తి	1,52,592	1,54,948	05	8,026	2.6



ఆదివారం రాత్రి సీలేరు పోలింగ్ కేంద్రానికి చేరుకున్న ఎన్నికల సిబ్బంది

ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

కొయ్యూరు, మే 12: మండలంలో సోమవారం జరగనున్న సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. మారుమూల అత్యంత మావోయిస్టు ప్రాభల్య ప్రాంతాలుగా గుర్తించిన ఆరు పోలింగ్ కేంద్రాలలో ప్రశాంతంగా పోలింగ్ నిర్వహించేందుకు సీఆర్‌పీఎఫ్ అదనపు పోలీసు బలగాలతో గాలింపు చర్యలు చేపట్టారు. మండలంలో వ్యాప్తంగా 43,178 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఎన్నికల నిర్వహణకు 56 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల ద్వారా 22,589 మహిళ ఓటర్లు, 20,588 పురుష ఓటర్లతో పాటు మరొక ట్రాన్స్‌జెండర్ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు పోలింగ్ కేంద్రం ప్రారంభ సంఖ్య 57తో ప్రారంభకాగా 112 బూత్ నంబరుతో ముగియనుంది. ఈ మేరకు పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు అసౌకర్యం కలగకుండా సంబంధిత అధికారుల తగిన చర్యలు చేపట్టారు.

జి.మాడుగులలో...

జి.మాడుగుల: మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సిబ్బంది ఆదివారం చేరుకున్నారు. మండలంలోని 17 పంచాయతీల్లో 61 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రమైన పాడేరు నుంచి నేరుగా ఆయా కేంద్రాలకు సిబ్బంది తరలివచ్చారు. మండల వ్యాప్తంగా 43,787 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

సీలేరులో..

సీలేరు: గూడెంకొత్తవీధి మండలంలోని సీలేరు పోలింగ్ కేంద్రానికి ఎన్నికల సిబ్బంది రాత్రి ఎనిమిది గంటల సమయంలో సుక్షితంగా చేరుకున్నారు. సెక్టార్ అధికారి మధుసూదనరావు, రూట్ ఆఫీసర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రం నుంచి మధ్యాహ్నం 12 గంటలకు బయలుదేరిన సిబ్బంది రాత్రి ఎనిమిది గంటల సమయంలో సీలేరు వచ్చారు. సీలేరు పోలింగ్ కేంద్రం మావోయిస్టు ప్రభావిత ప్రాంతం కావడంతో పోలీసు ఉన్నతాధికారులు జీకే వీధి నుంచి సీలేరు వరకు ముందస్తుగానే భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. వారి ద్వారా ఎన్నికల సిబ్బంది సురక్షింతంగా చేర్చారు. ఇక్కడికి వచ్చిన సిబ్బందికి బీఎల్‌వోలు కుసుమ, రేవతి, అనుష్క భోజన, వసతి ఏర్పాట్లు చేశారు.

ఏవోబీలో నాలుగు అంచెల భద్రత

- ప్రత్యేక పోలీసు బలగాలతో కూంబింగ్
- ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి
- అదనపు ఎస్పీ ప్రతాప్ శివకిశోర్



విలేకరులతో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ శివకిశోర్

చింతపల్లి, మే 12: సార్వత్రిక ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ఆంధ్రా, ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో నాలుగు అంచెల భద్రత ఏర్పాటు చేశామని అదనపు ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిశోర్ తెలిపారు. ఆదివారం సబ్ డివిజన్ పోలీసు కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు నెల రోజులుగా సరిహద్దు ప్రాంతాల్లో కూంబింగ్ నిర్వహిస్తున్నామన్నారు. ప్రధానంగా 56 గ్రేహౌండ్స్ పార్టీలతో పాటు 24 సీఆర్‌పీఎఫ్, ఏపీఎస్పీ, సివిల్ పోలీసులతో గాలింపు చర్యలు కొనసాగిస్తున్నామన్నారు. మావోయిస్టు కదలికలపై అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిఘా పెట్టామన్నారు. ప్రధాన రహదారులు, కల్వర్టు, బ్రిడ్జిల వద్ద బాంబ్ స్క్వాడ్ బృందాలు తనిఖీలు నిర్వహిస్తున్నాయన్నారు. మావోయిస్టు యాక్షన్ టీం సభ్యుల సమాచారం తెలియజేస్తే రూ.5 నుంచి రూ.25 లక్షల నజరానా అందజేస్తామన్నారు. మావోయిస్టులకు సహకరించి, వారి కార్యకలాపాల్లో పాల్గొంటే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

అత్యవసర పరిస్థితుల్లో హెలికాప్టర్ వినియోగం

శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా అత్యవసర పరిస్థితులు ఎదురైతే హెలికాప్టర్ వినియోగించేందుకు ముందస్తు ఏర్పాటు చేశామని అదనపు ఎస్పీ తెలిపారు. అలాగే పోలింగ్ కేంద్రాల్లో అల్లర్లు, అపరిచితులు, మావోయిస్టుల సంచారం కనిపిస్తే ప్రజలు స్వచ్ఛందంగా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. గిరిజన ప్రజలు నిర్భయంగా పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఓటు చాలా విలువైందని, సమర్థవంతమైన నాయకులను ఎన్నుకునేందుకు అందరూ ఓటు వేయాలని కోరారు.

పలకజీడిలో రెండు పోలింగ్ కేంద్రాల విలీనం

- పీఎల్ కొత్తూరు, రేవులకోట ఓటర్లు పలకజీడి వెళ్లాల్సిందే..



పలకజీడి పోలింగ్ కేంద్రానికి రాత్రి సమయంలో చేరుకున్న సిబ్బంది.. (ఇన్‌సెట్‌లో) పోలింగ్ కేంద్రం

కొయ్యూరు, మే 12: మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైన పెదలంక కొత్తూరు (పీఎల్ కొత్తూరు), రేవులకోటల్లో పోలింగ్ కేంద్రాల (నంబరు 80, 82)ను భద్రతా కారణాల దృష్ట్యా పలకజీడి కేంద్రం (నంబరు 81)లో విలీనం చేశారు. దీంతో ఇప్పటివరకు ఆయా కేంద్రాల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు సిద్ధమైన పీఎల్ కొత్తూరు, పుట్టకోట, జెర్రిగొంది గ్రామాలకు చెందిన 413 మంది ఓటర్లు, రేవులకోటలో ఓటు వేయాల్సిన 664 మంది సుమారు 15 కిలోమీటర్లు మేర కొండలపై నుంచి నడచి వచ్చి పలకజీడిలో ఏర్పాటు చేసిన కేంద్రంలో ఓటు వేయాల్సి ఉంది. అలాగే పీఎల్ కొత్తూరు నుంచి వై.రామవరం వచ్చి, అక్కడి నుంచి మరో 25 కిలోమీటర్లు ఆటోలు, జీపుల్లో ప్రయాణించి ఓటు హక్కు వినియోగించుకోవాల్సి ఉండడంతో ఓటర్లు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం పలకజీడిలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో పలకజీడితో పాటు మర్రిపాకలు, చీడికోట, జెర్రిగొంది, ఎర్రగొండకు చెందిన సుమారు 686 మంది ఓటర్లు తమ ఓటుహక్కు వినియోగించుకునేందుకు వీలుగా ఏర్పాట్లు చేశారు. తాజాగా అధికారులు తీసుకున్న నిర్ణయంతో అదనంగా 1077 మంది ఓటర్లు పలకజీడి పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.

ఆకతాయిలకు అడ్డాగా డంపింగ్ యార్డు



డుంబ్రిగుడ డంపింగ్ యార్డులో ఉన్న ఆకతాయిలు

డుంబ్రిగుడ, మే 12: పంచాయతీ కేంద్రాల్లో నిర్మించిన డంపింగ్ యార్డులు ఆకతాయిలకు అడ్డగా మారాయి. ఉపాధి పథకంలో భాగంగా టీడీపీ హయంలో చెత్తను వేరు చేసి పొడి చెత్త సేకరణకు డంపింగ్ యార్డులను నిర్మించారు. వైసీపీ ప్రభుత్వం తడి, పొడి చెత్త నిర్వహణకు వదిలలేయడంతో డంపింగ్ యార్డులు ఇలా నిరుయోగమయ్యాయి. వీటిని ఆకతాయిలు వినియోగించుకుంటున్నారు.

సార్వత్రిక ఎన్నికలకు సర్వం సిద్ధం

- పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సామగ్రి తరలింపు
- విధుల్లో 1786 మంది అధికారులు, సిబ్బంది
- ప్రత్యేకంగా 48 బస్సులు, 88 జీపుల ఏర్పాటు

అరకులోయ, మే 12: అరకు అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి పోలింగ్ కేంద్రాలకు ఆదివారం ఈవీఎంలు, ఎన్నికల సామగ్రితో అధికారులు, సిబ్బందిని తరలించారు. ఉదయం 6.30 గంటలకు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఎం.విజయసునీత, ఎన్నికల సాధారణ పరిశీలకులు కె.వివేకనందన్ సమక్షంలో నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి వి.అభిషేక్ స్ట్రాంగ్‌రూంలను తెరచి ఈవీఎంల పంపిణీ ప్రక్రియను ప్రారంభించారు. మధ్యాహ్నం ఒంటి గంట నాటికి ఈ ప్రక్రియను పూర్తి చేశారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి, ఐటీడీఏ పీవో అభిషేక్ మాట్లాడుతూ, ఎన్నికల సిబ్బందిని పోలింగ్ కేంద్రాలకు తరలించడానికి 48 బస్సులు, 88 జీపులను ఏర్పాటు చేశామన్నారు. 1786 మంది అధికారులు, సిబ్బంది ఎన్నికల విధుల్లో పాల్గొంటున్నారన్నారు. నియోజకవర్గంలో 2.47 లక్షల మంది ఓటర్లు ఉన్నారని, వారందరూ ఓటుహక్కును వినియేగించుకోవడానికి తగిన ఏర్పాట్లు పూర్తి చేశామని చెప్పారు.

సాయంత్రం 4 గంటల వరకే పోలింగ్

ఏజెన్సీలో విభిన్న వాతావరణ పరిస్థితుల కారణంగా ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభించి, సాయంత్రం 4 గంటలకు మగించాలని రిటర్నింగ్ అధికారి అభిషేక్ సూచించారు. ఏజెన్సీలో ఎక్కడా శాంతిభద్రతల సమస్యలు ఉండవని, నిర్భయంగా పోలింగ్ ప్రక్రియను పూర్తిచేసి సాయంత్రం ఏడు గంటలకు జిల్లా కేంద్రానికి చేరుకోవాలని ఎన్నికల సిబ్బందికి ఆయన సూచించారు. అలాగే సెక్టార్ అధికారులు పోలింగ్ సిబ్బందిని సురక్షితంగా కేంద్రాలకు తరలించాలని ఆయన చెప్పారు. ఐటీడీఏ ఏపీవో వెంకటేశ్వర్లు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వీవీఎస్.శర్మ, ఏఆర్‌వో సోమేశ్వరరావు, తహసీల్దార్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



పోలింగ్ నిర్వహణ కోసం ఈవీఎంలతో కేంద్రాలకు వెళ్తున్న ఉద్యోగులు



అరకులో ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రం వద్ద నిరీక్షిస్తున్న ఉద్యోగులు

ఘనంగా మోదకొండమ్మ జన్మదిన వేడుకలు

- భారీగా తరలివచ్చిన భక్తులు.. కిటకిటలాడిన ఆలయం

పాడేరు రూరల్, మే 12: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం పాడేరు మోదకొండమ్మ జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు సుబ్రహ్మణ్యం ఉదయం 5 గంటలకు అమ్మవారి అలంకరణ, ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఆలయ కమిటీ చైర్‌పర్సన్ కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, నరసింగరావు దంపతులు, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుళ్లి సింహాచలంనాయుడు, రమాదేవి దంపతులు, మోదకొండమ్మ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కొట్టగుళ్లి రామారావు, భాగ్యలక్ష్మి దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 6 గంటల నుంచి అమ్మవారి దర్శనానికి భక్తులు క్యూ కట్టడంతో ఆలయం కిటకిటలాడింది. గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కొండలరావు భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. అలాగే ఆలయం ప్రాంగణంలో మధ్యాహ్నం ఏర్పాటు చేసిన అన్నసమారాధన కార్యక్రమానికి అవసరమైన నిధులను ఐటీడీఏ పీవో వి.అభిషేక్ అందించారు. ఈ కార్యక్రమాన్ని ఆలయ కమిటీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి ప్రారంభించారు. సాయంత్రం 5 గంటల నుంచి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ, ఉత్సవ, వర్తక సంఘాల ప్రతినిధులు, గ్రామ పెద్దలు బూరెడ్డి రామునాయుడు, బీవీఎస్.ముకుందరావు, వెయ్యాకుల సత్యనారాయణ, టి.ప్రసాదరావునాయుడు, సిద్ధినాతి కొండలరావు, వంతినిభ రాజుబాబు, వెంకటరత్నం, శ్రీను, శివరాత్రి శ్రీనివాస్ కుమార్, సురేష్‌కుమార్ పాల్గొన్నారు.



అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు... (ఇన్‌సెట్‌లో) పూజలు అందుకుంటున్న అమ్మవారు



మోదకొండమ్మ ఉత్స విగ్రహం ఊరేగించేందుకు తీసుకు వస్తున్న దృశ్యం





పాడేరు-పెదబయలు ప్రధాన రహదారిలోని నిర్లక్ష్యంగా వదిలేసిన మట్టితో రోడ్డు మధ్యలో నిలిచిన నీరు... ఇంటిలోకి చేరిన వర్షం నీరు

హైవే అధికారుల నిర్లక్ష్యం... చింతలవీధి ప్రజలకు శాపం!

పాడేరు రూరల్, మే 12: హైవే రహదారి నిర్మాణ అధికారుల నిర్లక్ష్యం చింతలవీధి గ్రామ ప్రజలకు శాపంగా మారింది. రహదారి నిర్మించిన అధికారులు రోడ్డుకు ఇరువైలా సైడ్ కాలువలు, రహదారి నిర్మాణ సమయంలో వినియోగించిన మట్టి తొలగింపు వంటి చర్యలకు తిలోదకాలు ఇచ్చారు. అలాగే చింతలవీధిలో ప్రజలు నివాసం ఉంటున్న ప్రదేశంలో నిబంధనలు పాటించకపోవడంతో చినుకుపడితే చాలు ఆ గ్రామంలోని ప్రధాన రహదారికి పక్కనే ఉన్న గృహ లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

కాలువల లేకపోవడంతో ఇళ్లల్లోకి చేరుతున్న వర్షం నీరు

చింతలవీధి పంచాయతీ కేంద్రంలో శుక్రవారం కురిసిన భారీ వర్షానికి పాడేరు-అరకు-పెదబయలు ప్రధాన రహదారి పక్కనే నివాసం ఉంటున్న ప్రజల నివాస గృహాల్లోకి భారీగా వర్షం నీరు చేరిపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. పాడేరు-పెదబయలు ప్రధాన రహదారి చింతలవీధి జంక్షన్ వద్ద భారీగా వర్షం నీరు నిల్వ ఉండడంతో వాహనదారులు సైతం పడరాని పాట్లు పడ్డారు. గత నెల 21వ తేదీన కురిసిన భారీ వర్షానికి చింతలవీధి గ్రామంలో ప్రధాన రహదారి పక్కనే నివాసం ఉంటున్న బర్రె సూర్యకాంతం ఇంటిలోకి భారీగా వర్షం నీరు చేరడంతో ఆ రోజు ఆమె ఇల్లు కుప్పకూలిపోయింది. దీంతో ఆమె కుటుంబ సభ్యులు నిరాశ్రయులయ్యారు. ఈ ప్రాంతంలో ఇటీవల హైవే రహదారి నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టరు నిబంధనలకు నీళ్ల వదలడమే ఈ సమస్యకు కారణమని గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి చింతలవీధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తక్షణమే తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

బస్సులు లేక అవస్థలు

- నర్సీపట్నం డిపో నుంచి ఎన్నికల విధులకు 80 బస్సుల కేటాయింపు
- వివిధ ప్రాంతాలకు రాకపోకలకు ప్రయాణికులకు ఇబ్బందులు
- కాంప్లెక్స్‌లో గంటల తరబడి నిరీక్షణ.. ప్రైవేటు వాహనాల్లో ప్రయాణాలు

నర్సీపట్నం, మే 12 : ప్రజా రవాణా శాఖ నర్సీపట్నం డిపో నుంచి 80 బస్సులను పోలింగ్ సిబ్బంది, సామగ్రి తరలింపునకు కేటాయించడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నర్సీపట్నం నియోజకవర్గానికి 40 బస్సులు, ఇతర నియోజకవర్గాలకు 40 బస్సులను పంపిచారు. దీంతో ఆదివారం డిపోలో బస్సులు అందుబాటులో లేక వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రయాణికులు కాంప్లెక్స్ గంటల కొద్ది వేచి ఉండాల్సి వచ్చింది.

విశాఖపట్నానికి రెండు, చోడవరానికి రెండు, తుని, చింతపల్లి, సింగిల్ రూట్లకు ఒక్కొక్కటి చొప్పున మొత్తం 17 బస్సులను మాత్రమే ఆదివారం నడిపారు. రద్దీ ఎక్కువగా ఉండే విశాఖపట్నం రూట్లో ప్రైవేటు వాహనాలను ఆశ్రయించారు. తుని, కృష్ణాదేవిపేట, కోటవురట్ల, చోడవరం రూట్లలో ఆటోలలో ప్రయాణం చేయాల్సి వచ్చింది. సోమవారం పోలింగ్ తర్వాత ఈవీఎంలు, సామగ్రిని పటీడీ బస్సుల్లో అనకాపల్లి తరలించాల్సి ఉంటుంది.



బస్సులు లేక నర్సీపట్నం కాంప్లెక్స్‌లో ప్రయాణికుల ఇబ్బందులు

ఓటుకు వేళాయె..

... 5వ పేజీ తరువాయి

సంబంధించిన పోలింగ్ కేంద్రాలకు సామగ్రి, సిబ్బందిని పంపించారు. వరుసగా పోలింగ్ కేంద్రాలున్న ప్రాంతాలకు బస్సుల్లో, కాస్త మారుమూల ప్రాంతాల్లో ఉన్న పోలింగ్ కేంద్రాలకు జీపుల్లో ఎన్నికల సిబ్బందిని తరలించారు.

ఉన్నతాధికారుల పర్యవేక్షణలో తరలింపు ప్రక్రియ

జిల్లాలో ఎన్నికల సామగ్రి, సిబ్బంది ప్రక్రియను ఉన్నతాధికారుల పర్యవేక్షణలో ఆదివారం చేపట్టారు. జిల్లా కేంద్రాలోని ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్‌ను అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.విజయ సునీత, ఎన్నికల పరిశీలకుడు వివేకానందన్, రిటర్నింగ్ అధికారి భావన వశిష్ఠ తెరిచారు. అనంతరం వాటి పంపిణీని చేపట్టారు. ఎన్నికల సామగ్రి, సిబ్బందిని పోలింగ్ కేంద్రాలకు తరలించే ప్రక్రియను జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా స్వయంగా పర్యవేక్షించారు. పాడేరు నుంచి పోలింగ్ కేంద్రాలకు వాహనాలు చేరుకునే వరకు పోలీసులు అప్రమత్తంగా వ్యవహరిస్తూ బందోబస్తు చేపట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి పద్మావతి, రెవెన్యూ, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.



బస్సులో పోలింగ్ కేంద్రాలకు వెళుతున్న ఎన్నికల సిబ్బంది



వాహనాల్లోకి ఈవీఎంలను పెట్టేందుకు వెళుతున్న స్ట్రాంగ్‌రూమ్ సిబ్బంది

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి

ముంచంగిపుట్టు, మే 12: సార్వత్రిక ఎన్నికలు ప్రశాతంగా జరిగేందుకు అన్ని వర్గాల ప్రజలు తమవంతు సహకారం అందించాలని ఎస్‌ఐ కె.రవీంద్ర కోరారు. మండలంలోని పలు ప్రాంతాల్లో ముమ్మరంగా వాహనాలను తనిఖీలు చేశారు. అలాగే వారపు సంత ప్రాంతంలో నిఘా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులకు ఎవరూ ఆశ్రయం కల్పించరాదని, అనుమానాస్పదంగా ఎవరైనా సంచరిస్తున్నట్టు తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

హుకుంపేట, మే 12 మండలంలోని అర్హులైన ఓటర్లంతా సోమవారం జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని ఎస్‌ఐ సతీష్ సూచించారు. మారుమూల గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఆదివారం ఆయన పరిశీలించారు. అక్కడ పోలింగ్ నిర్వహణ ఏర్పాట్లు, సదుపాయాలను పరిశీలించారు. అనంతరం ఎస్‌ఐ మాట్లాడుతూ పోలింగ్‌కు ఎటువంటి ఇబ్బందులు లేకుండా 55 పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ఠమైన బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ప్రతీ పోలింగ్ కేంద్రంలోనూ 144 సెక్షన్ అమలులో ఉంటుందని చెప్పారు. నిబంధనలు ఉల్లంఘించినా, గొడవలకు పాల్పడినా కేసులు నామోదు చేస్తామని ఈ సందర్భంగా ఎస్‌ఐ హెచ్చరించారు. ప్రశాంతంగా ఎన్నికలు జరిగేందుకు అన్ని పార్టీల నాయకులు, ప్రజలు సహకరించాలని కోరారు.

మంచు అందాల కనువిందు

కుంతర్ల ఘాట్ రోడ్డులో ఆకట్టుకున్న సూర్యోదయం



మండలంలోని పెదకోడాపల్లి-కుంతుర్ల ఘాట్‌లో మంచు అందాలు కనువిందు చేశాయి. మేఘాలను చీల్చుకుంటూ సూర్యుడు ఉదయిస్తుండడం చూపరులను ఆకట్టుకుంటుంది. ఈ సుందర దృశ్యాలను తిలకిస్తూ అటుగా ప్రయాణించిన వాహన చోదకులు సెల్ఫీలు దిగుతూ సందడి చేశారు.

-పెదబయలు

పోలింగ్ కేంద్రం లేక పాట్లు

... 5వ పేజీ తరువాయి

అన్యాయమని స్థానిక గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లక్ష్మీపురంలోని పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓట్లు వేయాలని అధికారులు చెబుతున్నారని, అందుకు వాహనాలు ఏర్పాటు చేస్తామన్నారని గిరిజనులు తెలిపారు. అయితే ఓటు వేసేందుకు దగ్గరుండి తమను వాహనాల్లో తీసుకువెళ్లినా, తిరుగు ప్రయాణంలో తమను తీసుకువస్తారో లేదో తెలియని పరిస్థితి నెలకొందని వారు వాపోతున్నారు. గతంలో సైతం వాహనాల్లో తీసుకువెళ్లి తిరుగు ప్రయాణంలో తమను అక్కడ వదిలేసే వారని, తామంతా కష్టపడి గ్రామాలకు చేరుకొనేవారమని వారు తెలిపారు. పంచాయతీ పరిధిలో సుమారు 1,300 ఓట్లు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ రవాణా సదుపాయం కల్పించాలని, వచ్చే ఎన్నికల్లోనైనా తమ గ్రామంలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.